సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 3 । మార్చి । 2024



శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి

శ్రీనిత్యపూజ కోనలో ఈనెల 7 నుంచి జరిగే శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని కడప ఆర్డీఓ తెలిపారు. -IIలో



కాళ్ల పారాణి ఆరకుండానే..

నూరేళ్లు నిలవాల్సిన కాపురం అత్తవారింట అడుగు పెట్టకుండానే ముగిసిపోయింది.... కాళ్ల పారాణి ఆరకుండానే నవ వధువు మృత్యు ఒడికి చేరింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.80	రూ.130



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 81 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	432	432
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 56.300 కిలోలు

అన్నమయ్యలో అపార వనరులు

- అందరికీ ఉపాధి కల్పించేందుకు ప్రణాళిక
- వెనుకబడిన ప్రాంతాలు, అభివృద్ధి చెందిన జిల్లాల్లో పనిచేసిన అనుభవం
- జిల్లాలోని రైల్వేకోడూరులో ఏడాదిపాటు చదువుకున్నా
- ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు వెళతాం
- 'సాక్షి' తో అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్



రాయచోటిలోని అన్నమయ్య జిల్లా కలెక్టరేట్



సాక్షి ఇంటర్వ్యూ

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా అపార వనరులు కలిగిన జిల్లా. ఒక్కటి కాదు...అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించేందుకు అవకాశం ఉంది. ప్రధానంగా ఖనిజ సంపద మొదలుకొని గ్రానైట్, వ్యవసాయ, ఉద్యాన, పర్యాటక రంగాల్లో వనరులు అమోఘం. అంతేకాకుండా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో నిలుపడానికి ప్రణాళికలు రూపొందించాం. చిన్నప్పుడు రైల్వేకోడూరులో ఏడాదిపాటు విద్యాభ్యాసం కొనసాగింది. సివిల్స్‌కు ఎంపికైన అనంతరం పలు జిల్లాలో పనిచేస్తున్నప్పుడు కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజల్లో గడిపాను. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ ఆయా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటా. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేలా పకడ్బందీగా అడుగులు వేస్తున్నామని అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ముట్టింబాకు అభిషిక్త్ కిశోర్ తెలియజేశారు. అందుకు సంబంధించి శనివారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

కుటుంబ నేపథ్యం...చదువు

మాది జిల్లా కేంద్రమైన నెల్లూరు పట్టణం. నాన్న పేరు ఎంబీవీ కిశోర్, అమ్మ జయభారతి. తనకు సోదరుడు అభిలాష్ కిశోర్ ఉన్నారు. కుటంబంలో అందరూ పెద్ద స్థాయి ప్రభుత్వ ఉద్యోగులే కావడంతో నన్ను కూడా బాగా చదివించారు. తనను కుటుంబ సభ్యులు ఐఏఎస్‌కు ఎంపిక కావాలని భావించారు. నాకు సతీమణి ప్రత్యూషతోపాటు కుమారుడు రియాన్ అతుల్ అభిషిక్త్ కిశోర్ ఉన్నారు. ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు శ్రీకాళహస్తి, తిరుపతి, రైల్వేకోడూరు, చిత్తూరులలో చదివాను. ఇంటర్మీడియేట్ చిత్తూరులోని శ్రీ చైతన్య కళాశాలలో, బీటెక్ కంప్యూటర్ సైన్స్ చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం యూనివర్శిటీలో పూర్తి చేశాను. బీటెక్ చదువుతుండగానే క్యాంపస్ సెలెక్షన్స్‌లో ఉద్యోగం చేసే అవకాశం లభించింది.

తొలి ప్రయత్నంలోనే ఐఏఎస్‌కు ఎంపిక

2014లో సివిల్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా ప్రిపరేషన్ లేకుండానే పరీక్ష రాసి ఐఏఎస్‌కు ఎంపిక కావడం జరిగింది. 2015లో ప్రత్యేకంగా ఏడాదిపాటు ట్రైనింగ్ ఇచ్చారు. 2016-17 సంవత్సరంలో వెస్ట్ గోదావరిలో అసిస్టెంట్ కలెక్టర్‌గా కృష్ణా పుష్కరాలను అద్భుతంగా నిర్వహించాం. 2017-19 కాలంలో గిరిజన ప్రాంతమైన చింటూరు ఐటీడీఏ పీఓగా పని చేస్తూ పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి ప్రత్యేక కృషి చేయడం జరిగింది. అనంతరం 2019-22 మధ్య కాలంలో రాజమండ్రి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశాను. అదే సమయంలో కోవిడ్ వికృత రూపంతో అనేకమంది మృతి చెందుతున్నా చాలామందికి అండగా నిలబడి కష్టకాలంలో సాయం అందించాను. అలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల మధ్య తిరుగుతూ పనిచేయడం గర్వంగా అనిపిస్తోంది. 2022-23 ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గావిధులు నిర్వర్తించి అనేక భూ సమస్యలను పరిష్కరించాను. 2023లో ఫైనాన్స్ విభాగంలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ బదిలీ అయ్యాను. తొమ్మిదేళ్ల సర్వీసులో కోవిడ్, పోలవరం బాధితుల సమస్యలు, ఆర్థిక విభాగంలో పనిచేసిన అనుభవం చాలా ఉపయోగపడుతోంది. 2015 బ్యాచ్‌లో మొదట తనకే కలెక్టర్‌గా అవకాశం లభించడం సంతోషదాయకంగా ఉంది.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహిస్తాం

జిల్లాలో రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పారదర్శకంగా...ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాం. పోలీసుశాఖను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నాం. జిల్లాలో ఎన్నికల సమయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు కూడా యంత్రాంగానికి సహకరించాలి. సమస్య ఏదైనా పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నాం.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి టీమ్

జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 80 శాతం మంది ప్రజలందరూ రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నారు. వాటి పరిష్కారానికి ఒక ప్రత్యేక ఆలోచన చేశాను. రానున్న కాలంలో ఒక స్పెషల్ కలెక్టర్ స్థాయి హోదా కలిగిన అధికారితోపాటు కొంతమంది రెవెన్యూ సిబ్బంది ద్వా రా ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఎక్కడికక్కడ క్లియర్ ఉన్న సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు మిగతా పెండింగ్ వాటికి సంబంధించి వెంటనే క్షేత్ర స్థాయిలో పర్యటించి క్లియర్ చేసేలా ఆదేశాలు చేస్తున్నాం. ఏదైనా ప్రజలకు సంబంధించిన సమస్యలను తొలి ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తాం.

వనరుల సద్వినియోగంతో ఉపాధి అవకాశాలు

జిల్లాలో అద్భుతమైన వనరులు ఉన్నాయి. ప్రధానంగా మంగంపేట బెరైటీస్, పుల్లరిన్, మదనపల్లె గ్రానైట్, ఇతర ఉద్యాన, వ్యవసాయం, పాల ఉత్పత్తిలో జిల్లా అగ్రగామిగా ఉంది. ఈ వనరులను సద్వినియోగం చేసుకుని ఉపాధికి బాట వేయడంతో పాటు ఆర్థికాభివృద్ధి సాధించడానికి అడుగులు ముందుకు వేస్తాం. డ్వాక్రా మహిళలకు ఉపాధి, పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రణాళికలు ఉన్నాయి. అంతేకాకుండా విద్యాపరంగా పేరెన్నికగన్న పాఠశాలలను తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జిల్లాకు కొత్తగా ప్రాజెక్టులు తేవడంతోపాటు ఉన్న అవకాశాల మేరకు సాగునీటిని అందించి బంగారు పంటలు పండేలా అవకాశాలను పరిశీలిస్తున్నాం. వేసవిలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. ప్రజల సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ అడుగులు ముందుకు వేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా అన్ని రంగాల్లో జిల్లాను ఆదర్శంగా నిలిపేందుకు పథక రచన చేశాం. ఇప్పటికే డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా సుమారు ఆరు వేల కోట్లకు పైగా ప్రయోజనాలు అందించారు. జిల్లాకు పలు పరిశ్రమలు కూడా వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

అట్టహాసంగా అన్నమయ్య విగ్రహావిష్కరణ



అన్నమయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లా కేంద్రం కడప నగరంలోని మద్రాసు రోడ్డులో అన్నమాచార్యుల నూతన కాంస్య విగ్రహావిష్కరణ అట్టహాసంగా జరిగింది. 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై లోడర్ మిషన్ సాయంతో విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగు సాహితీ చరిత్రలో తొలి వాగ్గేయకారుడు అన్నమాచార్యులని కొనియాడారు. పద కవితా పితామహుడైన ఆయన వెంకటేశ్వరస్వామిని కీర్తిస్తూ 32వేలకు పైగా కీర్తనలు రచించారని తెలిపారు. ఆయన మన జిల్లాలో జన్మించడం మనందరి అదృష్టమన్నారు. అన్నమయ్య విగ్రహాన్ని ఆవిష్కరించే భాగ్యం తమకు దక్కడం గర్వంగా భావిస్తున్నామన్నారు. కడప నగరంలో అన్ని కూడళ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాషా, పాకా సురేష్, జయచంద్రారెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, శివా నాయక్, శివకేశవ, సీహెచ్ వినోద్, దాసరి శివప్రసాద్, పత్తిరాజేశ్వరి, ఎం. చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

తహసీల్దార్ల బదిలీ

రాయచోటి: అన్నమయ్య జిల్లా పరిధిలో తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ టి ఆనంద్ కుమార్‌ను చిన్నమండెంకు, కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటీవ్ అధికారిగా పనిచేస్తున్న ఆర్ శివరాముడును కోడూరుకు, కలెక్టరేట్‌లో కో–ఆర్డినేషన్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆర్ గోవింద్ సింగ్‌ను కలెక్టరేట్ ఏఓగా, చిన్నమండెం తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె సతీష్‌ను కలెక్టరేట్‌లో పీఓఎల్‌ఆర్ సెక్షన్ సూపరిటెండెంట్‌గా, కలెక్టరేట్‌లో పీఓఎల్‌ఆర్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డీసీ కృష్ణ మోహన్‌ను కలెక్టరేట్‌లో కో–ఆర్డినేషన్ సెక్షన్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. పి నరసింహ కుమార్‌ను ఎలక్షన్ సెక్షన్(ఎఫ్‌ఏసీ) సూపరింటెండెంట్‌గా, నంద్యాల జిల్లా కలెక్టరేట్‌లో డి సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులను గాలివీడు తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

మల్లయ్యకొండకు రూ.5లక్షల ఆదాయం



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న మహిళా సేవకులు

తంబళ్లపల్లె: శ్రీభ్రమరాంభిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి హుండీ ద్వారా రూ.501243లక్షలు ఆదాయం వచ్చింది. శనివారం ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, ఈవో రమణల ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని టీటీడీ మహిళా సేవకులు లెక్కించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మల్లయ్యకొండ అభివృద్ధికి, భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నారు. దీంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్నారు.

రామయ్యను దర్శించుకున్న కంచి పీఠాధిపతి



ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో కంచి పీఠాధిపతి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో వెలసిన రఘురామున్ని శనివారం కంచి కామకోటి పీఠం అధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ లాంఛనాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షణ గావించి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంగమండపంలో కంచి పీఠాధిపతిని సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆయన ఒంటిమిట్ట నుంచి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



హాల్ టికెట్లు పరిశీలిస్తున్న డీఐఈఓ కృష్ణయ్య

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో రెండో రోజున ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శనివారం జిల్లాలో 54 పరీక్ష కేంద్రాల్లో 11354 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వీరిలో 10819 మంది హాజరు కాగా 535 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య చెప్పారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 1010 మంది విద్యార్థులకు 937 మంది శనివారం పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఉషశ్రీ

రాయచోటి అర్బన్: జిల్లాలో మార్చి 3వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ ఉషశ్రీ పిలుపునిచ్చారు. పల్స్‌పోలియో కార్యక్ర మంపై శనివారం వైద్య,ఆరోగ్యశాఖాధికారులు, సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 3న 5 సంవత్సరాల లోపు పిల్లలందరికి పోలియోచుక్కలు వేయనున్నట్లు చెప్పారు.జిల్లా వ్యాప్తంగా 1602 పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు 1,93, 946 మందికి పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటికే కార్యక్రమం నిర్వహణకు సంబంధించి వైద్య ఆరోగ్య, విద్య, స్త్రీ,శిశు సంక్షేమశాఖల సిబబదికి, వలంటీర్లకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఒక వేళ ఆదివారం ఏకారణం చేతనైనా పోలియో చుక్కలు వేయించకపోతే సోమ,మంగళవారాల్లో సంబంధిత కేంద్రాల సిబ్బంది ఇంటింటికి వచ్చి వేస్తారన్నారు. కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డేవిడ్ సుకుమార్, డిప్యూటీ డెమో దేవశిరోమణి, వైద్య, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించండి

రాయచోటి: జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరచేందుకు నిర్వహించనున్న ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఈ సర్వే నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాలలో వార్డు అమెనిటీస్ సెక్రటరీలు సర్వే చేస్తారన్నారు. జనరల్ మేనేజర్, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీల పర్యవేక్షణలో సర్వే జరుగుతుందన్నారు. సర్వే పురోగతిపై ప్రతివారం సమీక్షించి తగు ఆదేశా లను జారీ చేయనున్నట్లు తెలిపారు.

పది పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎం. వెంకటకృష్ణారెడ్డి

వైవీయూ: పదోతరగతి పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని పదోతరగతి పరీక్షల జిల్లా పరిశీలకులు, ఏపీ మోడల్‌స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ ఎం. వెంకటకృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 2023 -24 పదో తరగతి పరీక్షల నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌కు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సీఎస్, డీఓలు సమన్వయంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులు సరిగ్గా ఉన్నాయో లేదో ముందుగానే చూసుకోవాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం. అనూరాధ మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు అనుసరించి మెలగాలన్నారు. కార్యక్రమంలో కడప ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, కడప ఎంఈఓ పాలెం నారాయణ, డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ఐబీ టీం



ప్రభుత్వ అంధుల పాఠశాలలో ఐబీ టీం

వైవీయూ: ఇంటర్నేషనల్ బాకాలారియట్ ప్రతినిధులు శనివారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఐబీ టీం సభ్యులు, ఐబీ కరికులం రూపకల్పన సీనియర్ మేనేజర్ వెండ్రీ గ్రీన్ (అమెరికా వాషింగ్‌టన్ డీసీ), ఐబీ పర్సన్ డెవలప్‌మెంట్ స్పెషలాఫీసర్ ఎరిక్ బాబర్ (ఇంగ్లాండ్), ఎస్‌సీఈఆర్‌టీ ఐబీ కరికులం స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ వై. గిరిబాబు యాదవ్‌ల బృందం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్, ప్రభుత్వ అంధుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఐబీ ప్రతినిధుల బృందం మెయిన్ స్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాల నిర్వహణ, తరగతుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 8, 9 తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌పీ ద్వారా నిర్వహిస్తున్న బోధనను పరిశీలించారు.

విద్యార్థులతో పాటు వారు కూర్చుని బోధన అభ్యసన ప్రక్రియను పరిశీలించి నోట్ చేసుకున్నారు. అనంతరం సైన్స్‌ల్యాబ్‌లో ప్రదర్శించిన ప్రాజెక్టులను వాటి ద్వారా కలిగే ప్రయోజనాలను, విద్యార్థులకు ఏ విధంగా నేర్పుతున్నారన్న విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న గోరుముద్ద ద్వారా విద్యార్థులకు అందుతున్న నాణ్యమైన భోజనాన్ని పరిశీలించి నమోదు చేసుకున్నారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, విద్యార్థులకు అందిస్తున్న ఆర్‌ఓ వాటర్, ఇతరత్రా వివరాలను పరిశీలించి పాఠశాల నిర్వహణ విధానాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.టి. దామోదర్, టి. రవిశంకర్ రెడ్డి, బి. రమేష్, సత్తార్, వెంకటలక్ష్మి, రెడ్డినాయక్, సీఆర్‌ఎంటీ వెంకటకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాల పరిశీలన..

కడప నగరం శంకరాపురంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలను ఐబీ ప్రతినిధుల బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా అంధుల చదువుకు సంబంధించిన బ్రెయిలీ పలక, బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వేపరాల ఎబినైజర్, ఉపాధ్యాయులు రాజ, మురళి, నరసింహులు, కుమారస్వామి, కరీముల్లా, లక్ష్మీదేవి, రమణ, సరస్వతమ్మ, అరుణ, నవీన్‌త తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: జిల్లాలో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు -2024 కోసం అన్ని విధాలా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. వచ్చే వారంలోగా రాజకీయ పార్టీలతో ఎన్నికల అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో గుర్తింపు పొందిన ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ఆర్డీఓలు రంగస్వామి, మోహన్‌రావు, హరిప్రసాద్, కోడూరు, పీలేరు, తంబళ్లపల్లె ఈఆర్‌ఓలు లీలా రాణి, రమా, రాఘవేంద్ర, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

- ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని గవర్నర్ ఫంక్షన్ హాల్‌లో 2024–సాధారణ ఎన్నికల నిర్వహణపై అధికారులకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. . పోలింగ్ పూర్తయి బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ వరకు తీసుకొచ్చే పూర్తి బాధ్యత మీరే తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్‌చైర్లు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వెబ్ కాస్టింగ్ చేయడానికి అవసరమైన విద్యుత్ సౌకర్యాలు సక్రమంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్డీఓలు, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, డీపీఓ ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.
- ప్రభుత్వ పథకాల ప్రగతి సాధనలో వందశాతం లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, రీ సర్వే మూడోదశ, ఇనామ్, అసైన్డ్ భూములు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్స్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ సత్యనారాయణరావులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా ప్రాధాన్యత అంశాలలో సెక్టార్ వారీగా అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలన్నారు.
- ఈనెల 3వ తేదీ జిల్లా వ్యాప్తంగా చేపట్టే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.
- జిల్లాలో క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా మండలాల్లో ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడి నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లు పక్కాగా చేపట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షరీఫ్

పెండ్లిమర్రి : పొలతల శైవ క్షేత్రంలో మహాశివ రాత్రి పర్వ దినం సందర్భంగా ఈనెల7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సంబంధించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని కడప ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్‌లు పేర్కొన్నారు. పొలతల క్షేత్రంలోని పర్యాటక భవనంలో శనివారం ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పార్కింగ్ స్థలాన్ని పెంచి వచ్చిన వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయించాలన్నారు. అలాగే ఘాట్‌ల వద్ద బారికేడ్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. ముఖ్యంగా తాగు నీటికి ఇబ్బందులు రా కుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు పూ డ్చి వేయాలన్నారు. అత్యవసర సేవలకు 108 అంబులెన్స్ వాహనాలు అందుబాటులో ఉంచా లన్నారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మదనపల్లె పురపాలక సంఘము

ఆర్.ఓ.సి.నెం.4075/2024/ఎ1 తేది: 20.02.2024

బహిరంగ వేలము నోటీసు

మదనపల్లె పురపాలక సంఘమునకు చెందిన దినసరి మార్కెటు, వారపుసంత, జంతువధశాల, మాంసం మార్కెటు మరియు ప్రైవేట్ బస్టాండ్ లలో ఆశీలు వసూలు చేసుకొనే హక్కుపై తేది: 13.03.2024వ తేది ఉదయం. 11.00 గం.లకు మున్సిపల్ కార్యాలయము నందు కమిషనరు గారిచే గాని లేదా వారి అనుమతి పొందిన ఇతర అధికారుల చేగాని బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలములో పాల్గొన పాటదారులు దిగువ షరతులకు లోబడి బహిరంగ పాటలో పాల్గొనవచ్చును.

వ. నెం.	వివరములు	సాల్వెన్సీ సర్టిఫికెట్	పాట కాలమందు చెల్లించవలసిన డిపాజిట్ రూ. (డి.డి.లు మాత్రమే)	రిజిస్ట్రేషన్ చార్జీలు నిమిత్తం చెల్లించవలసిన డిపాజిట్ రూ.
1.	వారపు సంత	రూ.10,00,000	రూ. 5,00,000	రూ. 50,000
2.	దినసరి కూరగాయల మార్కెట్	రూ. 20,00,000	రూ. 10,00,000	రూ. 75,000
3.	దినసరి మాంసం మార్కెటు	రూ. 2,00,000	రూ. 50,000	రూ. 20,000
4.	జంతు వధశాల	రూ. 1,00,000	రూ. 50,000	రూ. 15,000
5.	ప్రైవేట్ బస్టాండు	రూ. 1,00,000	రూ. 30,000	రూ. 15,000

వేలము షరతులు:

1) జిల్లా గెజిట్‌నెం.19/2024 తేది: 14.02.2024 నందు షరతులకు లోబడి పాటలో పాల్గొనవలెను.
2) పాట పాడుటకు ముందుగ గెజిట్‌ను పూర్తిగా చదువుకొని పాటలో పాల్గొనవలెను.
3) పాటదారుని పేరున మునిసిపాలిటి వారికి ఏవిధమైన బకాయిలు ఉండరాదు. అట్టివారు అనర్హులు.
4) పాటపై 18% జి.ఎస్.టి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారము తప్పని సరిగ చెల్లించవలెను.
5) పాట మొత్తంపై అగ్రిమెంటు రిజిస్ట్రేషన్ చేయించి దాఖలు చేయవలెను. రిజిస్ట్రేషన్ చార్జీలు పూర్తిగా పాట దారులు చెల్లించి కొనవలెను.
6) పాట ఖాయపరచిన 7 దినములు లోగా 3 నెలసరి కిస్తులు ముందుగ అడ్వాన్సుగా చెల్లించి, మిగిలిన 9 నెలల కిస్తులుకు పోస్ట్ డేట్ చెక్కు ఇవ్వవలెను.
7) ప్రతి నెల నెలసరి కిస్తు ఆ నెల 5వ తేది లోగా చెల్లించవలెను. నిర్ణీత సమయం దాటిన నూటికి నెలకి 2.5% శాతము అపరాధ రుసుము చెల్లించవలెను.
8) పాట రద్దు పరచుటకు గాని వాయిదా వేయుటకు పూర్తిగా అధికారము కౌన్సిలు వారికి కలవు.
9) మిగిలిన షరతులు కార్యాలయము పనిచేయు సమయములో తెలుసుకొనవచ్చును.

సం/- **కమిషనరు**, మదనపల్లె పురపాలక సంఘము

కాళ్ల పారాణి ఆరకుండానే..మృత్యు ఒడికి

అనారోగ్యంతో నవవధువు మృతి



మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నవ వధువు రేణుక మృతదేహం

మదనపల్లె : మూడుముళ్ల బంధం మున్నాళ్ల ముచ్చటైంది.. కన్న తల్లిదండ్రుల ఆశలు అంత లోనే ఆవిరయ్యాయి.. నూరేళ్లు నిలవాల్సిన కాపురం అత్తవారింట అడుగు పెట్టకుండానే ముగిసిపోయింది....కాళ్ల పారాణి ఆరకుండానే నవ వధువు మృత్యు ఒడికి చేరింది. ఇరు కుటుంబాలలో అత్యంత విషాదం మిగిల్చిన ఈ సంఘటన శనివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. చెర్లోపల్లె పంచాయతీ దిగువ తొట్లవారిపల్లెకు చెందిన రామాంజులు,రామలక్ష్మి దంపతుల కుమార్తె రేణుక (26), ను సత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి గ్రామానికి చెందిన మహేష్ తో ఫిబ్రవరి 28వ తేదీన ఇరు కుటుంబాల సమక్షంలో ఘనంగా వివాహం జరిపించారు. నవ దంపతులు మూడు రోజులుగా దిగువ తొట్టివారి పల్లెలోని వధువు పుట్టినింటిలో ఉంటున్నారు. శనివారం ఉదయం నిద్ర లేచిన రేణుక కొంతసేపు కుర్చీలో కూర్చుంది. అనంతరం కుర్చీలో నుంచి లేస్తున్న క్రమంలో కళ్లు తిరిగి కింద పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు, భర్త మహేష్ హుటాహుటి న ఆమెను 108 వాహనంలో మదనపల్లి ప్రభు త్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు రేణుక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి స్పష్టమైన కారణాలు తె లియకపోయినా, స్థానిక వైద్యులు మీకు ఏమైనా అనుమానాలు ఉంటే పోస్టుమార్టం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులకు చెప్పారు. అయితే మృతురాలి భర్త కుటుంబ సభ్యులు తమకు ఎలాంటి అనుమానాలు లేవంటూ, మృతదేహాన్ని స్వగ్రామం దిగువతొట్లివారి పల్లెకు తరలించారు. చాలాకాలం తర్వాత రేణుకకు పెళ్లి కావడంతో ఆ ఇంటిలో సంతోషం నిండగా, అది కాస్త మున్నాళ్ల ముచ్చటగానే మారి తీవ్ర విషాదం నింపింది. భార్య మృతితో ఆమె భర్త మహేష్ తీవ్ర కన్నీటి పర్యంతం అయ్యాడు. కాగా నవ దంపతులు ఇద్దరు ఆదివారం అత్తవారింటికి వెళ్లాల్సి ఉంది. అంతలోనే తమ ఇంటి కోడలు మృత్యు ఒడికి చేరుకోవడం అటు మెట్టినింటా, ఇటు పుట్టినింటా కన్నీటిని మిగిల్చింది.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి

కడప ఆర్డీఓ మధుసూదన్



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

సిద్దవటం : మండలంలోని వంతాటిపల్లి గ్రామ పంచాయతీ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన శ్రీనిత్యపూజ కోనలో ఈనెల 7,8,9 తేదీలలో జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలను మండల అధికారులు సమన్వయంతో జయప్రదం చేయాలని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మండల అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో శ్రీ నిత్యపూజ స్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పంచలింగాల వద్ద, నిత్యపూజ స్వామి కోనలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనాదారులు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం రేంజర్ కళావతి, తహసీల్దార్ మురాషావలి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఎస్ఐ పెద్దఓబన్న, నిత్యపూజ స్వామి ఆలయ చైర్మన్ కొండారెడ్డి, సిబ్బంది ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వెంకటేష్, పీఆర్ ఏఈ సుబ్రమణ్యం, ట్రాన్స్‌కో ఏఈ జయచంద్ర, సర్పంచ్ ప్రతినిధి కొంగా లక్ష్మిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో కర్ణాటక వాసి మృతి



చేపలు పట్టేందుకు వెళ్లి కరెంటు షాక్‌కు గురై మృతి చెందిన ఫకీర్

మదనపల్లె : ఉపాధి కోసం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చి... ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ కు గురై ఓ మత్స్యకార కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం ములకలచెరువు మండలంలో జరిగింది. మద్దినాయినిపల్లె చెరువులో చేపలు పట్టేందుకు కర్ణాటక రాష్ట్రం దావనగిరి జిల్లా చెన్నైగిరి తాలూకా తుల్కేరి హోసెల్లికి చెందిన నాగప్ప కుమారుడు ఎస్. ఫకీర్ (27) వచ్చాడు. మదనపల్లి మండలం సీటీఎంకు చెందిన కిరణ్ మద్దినాయనిపల్లె చెరువుతోపాటు మరో మూడు చెరువులలో చేపలు పట్టేందుకు వేలం పాట పాడుకున్నారు. చేపలు పట్టేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి మత్స్యకార కార్మికులను పిలిపించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం మద్ది నాయన చెరువులో చేపలు పట్టేందుకు ఫకీర్ వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ఇనుప చువ్వలతో కూడిన వల విసురుతుండగా, ప్రమాదవశాత్తు చెరువు పైనుంచి వెళుతున్న 33 కేవీ విద్యుత్ లైన్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో ఫకీర్ రెండు కాళ్లు తీవ్రంగా గాయపడగా వీపుపై గాయాలయ్యాయి. అత్యంత ప్రమాదకర స్థితిలో స్థానికులు అతన్ని వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బాధితున్ని స్థానిక వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. బెంగళూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలోని చింతామణి సమీపంలో అతను ప్రాణాలు విడిచాడు. ములకలచెరువు పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించినట్లు తెలిసింది.


రైలు పట్టాలపై గుర్తు తెలియని మహిళ మృతదేహం



రైలుపట్టాల వద్ద మహిళ మృతదేహం

రాజంపేట : రాజంపేట-పుల్లంపేట స్టేషన్ మధ్య జాగురవారిపల్లె సమీపంలో ఓ మహిళ (40) మృతదేహం రైలుపట్టాల వద్ద పడి ఉండటాన్ని గుర్తించారు. రైల్వే అధికారుల సమాచారంతో సంఘటన స్థలానికి రేణిగుంట పోలీసులు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మృతురాలి వివరాలను సేకరించే పనిలో పోలీసులు ఉన్నారు. కాగా మహిళ మృతి అనుమానాస్పదంగా ఉందనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్టీయూలో పాము కలకలం



పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని మహిళల వసతి గృహంలో పాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. విద్యార్థులు నిద్రిస్తున్న గదుల్లోకి విషపురుగులు రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వసతి గృహాల్లోకి విషపురుగులు రాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

10 మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె : పేకాట ఆడుతున్న పదిమంది జూదరులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎన్. శేఖర్ తెలిపారు. మండల పరిధిలోని మాదినికొండ సమీప ప్రాంతంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందగా సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పలు ప్రాంతాలకు చెందిన పదిమంది జూదరులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.15,300 నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. రిమాండ్ నిమిత్తం వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైనది భారతి సిమెంట్

బ్రహ్మంగారిమఠం : అత్యుత్తమ కట్టడాలకు పటిష్టమైన సిమెంట్ భారతి సిమెంట్ అని ఆ కంపెనీ జిల్లా టెక్నికల్ ఇంజినీర్ కె . నాగేంద్ర తెలిపారు. శనివారం బ్రహ్మంగారిమఠంలో తాపీ మేస్త్రీలకు సిమెంట్ నాణ్యత, వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే 20 మంది మేస్త్రీలకు రూ 1లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సిమెంట్ రోబోటిక్, జర్మనీ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. భారతి అల్ట్రా ఫాస్ట్ సిమెంట్ మరింత నాణ్యత కల్గి ఉంటుందన్నారు. ఈ సిమెంట్ పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందన్నారు. ఇతర రకం సిమెంట్ 5 గంటల్లో సెట్ అయితే భారతి అల్ట్రా ఫాస్ట్ 2 గంటలలోనే సెట్ అవుతుందన్నారు. ఒక వేళ వర్షం పడే సూచనలున్నా ఈ సిమెంట్ వినియోగించవచ్చన్నారు. ఈ కార్యకరమంలో సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, స్థానిక డీలర్ భూమిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

తల్లి మరణంతో అనాథ అయిన బాలిక

బి.కోడూరు : తల్లి వింతవ్యాధితో మరణించడంతో పాటు తండ్రి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బాలిక అనాథగా మిగిలిపోయింది. వివరాల్లోకి వెళితే మండలంలోని పాయలకుంట్ల గ్రామానికి చెందిన కొమరాజుగుర్రప్పడు, మానసలకు పది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి వివాహమైన మూడు సంవత్సరాలకు హారిక అనే కుమార్తె జన్మించింది. మానసకు సోరియాసిస్ వ్యాధి వ్యాపించడంతో ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆమెకు గుర్రప్పడు సరిగా వైద్యం అందించకపోవడంతో వ్యాధి తీవ్రమైంది. రోజురోజుకు ఆరోగ్యం క్షీణించడంతో ఆమె భర్త రెండు సంవత్సరాల క్రితం వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పటి నుండి హారిక ఆలనాపాలన తల్లి మానసతో పాటు తోటి బంధువులు చూసుకునేవారు. మానస ఆరోగ్యంగా రోజురోజుకు క్షీణించి చివరకు శుక్రవారం ఆమె మృతి చెందింది. దీంతో హారిక ఆలనాపాలన చూసే వారు లేకపోవడంతో ఆ బాలిక అనాథగా మిగిలింది. బాలిక దయనీయ పరిస్థితిని చూసిన గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతున్నారు. అనాథగా మిగిలిన హారికను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గోడ కూలి వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాగర్‌కాలనీలో గోడకూలి కొమ్మినేని సుదర్శన్ (36) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఏఎస్ఐ యోగా రాయల్ తెలిపారు. సుదర్శన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అతని సంబంధించి పాత ఇంటి గోడ ఉంది. జేసీబీతో ఆ ఇంటిని తొలగిస్తుండగా ఒక్కసారిగా గోడ సుదర్శన్‌పై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందు తూ మృతి చెందాడు.

సీమ అభివృద్ధికి కృషి

కమలాపురం : రాయలసీమ అభివృద్ధికి కృషి చేస్తానని రాయలసీమ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కుంచం వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం ఆయన కమలాపురంలో విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. తమ పార్టీ తరపున సలహాదారునిగా ప్రముఖ రచయిత ఖలందర్‌ను నియమించామన్నారు.

అదుపు తప్పి మద్యం లారీ బోల్తా

సిద్దవటం : సిద్దవటం గ్రామ శివారులోని మద్యం దుకాణం సమీపంలో అదుపు తప్పి మద్యం లారీ బోల్తా పడింది. లారీ డ్రైవర్ శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సింగరాయకొండ నుంచి ఏసీ బ్లాక్ మద్యం లారీలో కడపకు రవాణా చేస్తుండగా సిద్దవటం గ్రామ శివారులోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మద్యం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ఈ విషయాన్ని వెంటనే అధికారులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలాన్ని కడప ఎక్సైజ్ శాఖ అధికారులు పరిశీలించారు.



ఎంతో మేలు చేశారు



నేను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నా. నాకు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమార్తె అఫ్రా అంజుమ్ ఇంటర్మీడియట్ చదువుతోంది. రెండవ పాప ఆయిషా అంజుమ్ 9వ తరగతి, బాబు మహమ్మద్‌ఖైఫ్ మూడవ తరగతి చదువుతున్నాడు. పిల్లలను చదివించాలంటే భారంగా ఉండేది. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అయ్యాక మా రెండో పాప ఆయిషా అంజుమ్‌కు అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. దీంతో పిల్లల చదువు సాఫీగా జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారు. – బాబ్‌జాన్, ఆటో డ్రైవర్, గౌసియావీధి, మదనపల్లె.

ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు అందాయి



పీలేరు రూరల్ : గతంలో మా పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందాలంటే మీ సేవలో దరఖాస్తు చేసుకుని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా పిల్లలకు సకాలంలో సర్టిఫికెట్లు అందేవికావు. అయితే జగనన్న సురక్ష పథకంలో గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోగా ఒక రోజులోనే ధ్రువపత్రాలు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చారు. ప్రభుత్వ సేవలు ఇంత సులభంగా అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలి. – కస్తూరి, బోడుమల్లువారిపల్లె, పీలేరు మండలం

సొంతింటిని నిర్మించుకున్నా



జగనన్న ప్రభుత్వం వచ్చాక నేను సొంతింటిని నిర్మించుకున్నాను. ఇప్పటి వరకు సొంతిల్లు లేకపోవడంతో అమ్మగారింట్లోనే తల దాచుకునేదానిని. గత కొన్నేళ్లుగా ఇల్లు కావాలని అర్జీలు పెట్టుకున్నాను. కానీ ఇల్లు మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం రాగానే ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. నాకు జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇల్లు మంజూరు కావడంతో ఇంటిని నిర్మించుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. – చందనాల జయలక్షుమ్మ, బ్రాహ్మణపల్లె, గోపవరం మండలం

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి



ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లెకు చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులరెడ్డి, ఓబులవారిపల్లె మాజీ సర్పంచ్ ఓబిలి శ్రీధర్‌రెడ్డిలు శనివారం ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సంక్షేమ కార్యక్రమాలతో పాటు వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. జగన్ సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో రైల్వేకోడూరులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు వర్గాలు, పార్టీలకు అతీతంగా తమందరిని కలుపుకుని పోయి అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. అలాగే టీడీపీలో తగిన ప్రాధాన్యత లేదని అందుకే మరలా సొంతగూటికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతానికి చెందిన 10 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీని వీడి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో కౌన్సిలర్ కొలిమి హారూన్‌బాషా ఆధ్వర్యంలో శనివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరికి శ్రీకాంత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఇర్షాద్, మహాల్‌ఖాన్, ఆసిఫ్, ఇర్ఫాన్, సొహైల్‌అలీ, తబ్రేస్, నాసిర్, యూసూఫ్, ఖదీర్, ముజఫర్, జబీవుల్లా, ఖాజా, ముస్తఫా, ఖాదర్, సయ్యద్, జమాల్, అబ్దుల్లా, లడ్డా, సలాంబేగ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఇస్మాయిల్

- మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా ఇర్ఫాన్
- పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి
- నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

కమలాపురం : పార్టీకి మీరు చేసిన సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మీకు పదవులు కేటాయించారని, ఆ పదవులకు మీరు వన్నె తీసుకురావాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి పదవులు పొందిన నేతలకు నియామక పత్రాలు అందజేశారు. కమలాపురం పట్టణానికి చెందిన షేక్ ఇస్మాయిల్ (దర్గా-ఈ-గఫారియా)ను వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీటీసీ ఇర్ఫాన్‌ను మైనార్టీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నిమ్మకాయల సుధాకర్ రెడ్డిని పార్టీ కేంద్ర కమిటీ నియమించి జారీ చేసిన నియామక పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కమలాపురం నియోజకవర్గ నాయకులు చేసిన సేవలను గుర్తించి పదవులు కట్టబెట్టిందన్నారు. భవిష్యత్తులో మీరు మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. మైనార్టీ సెల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి శాలువ కప్పి, పూలమాలతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, హిదాయత్, చెన్నకేశవరెడ్డి, ఉరుటూరు సురేష్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, జావీద్, ఖాద్రి, గఫార్, బాండ్, సుబ్బన్న, రబ్బాని, నూర్, భీమా తదితరులు పాల్గొన్నారు.